## క్లుప్తంగా

### బర్దన్ సేవలు చిరస్మరణీయం



ఏబీ బర్దన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

**మల్కాపురం:** సీపీఐ అగ్రనేత ఏబీ బర్దన్ సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా నాయకుడు కాంద్రేంగుల సత్యాంజనేయ అన్నారు. మల్కాపురం గ్రామ మండలిలో గురువారం సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీకి బర్దన్ అందించన సేవలను గుర్తుచేశారు. పార్టీ నాయకులు వై.కనకేశ్వరరావు, ఇ.రామకృష్ణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### ఫోక్ డ్యాన్స్‌లో ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న పాలిటెక్నిక్ విద్యార్థులు

**గోపాలపట్నం:** బెహరా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఫోక్ డ్యాన్స్‌లో ప్రతిభ చూపారు. ఆంధ్రా యూనివర్సిటీ నేషనల్ సర్వీస్ స్కీం ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మూడో స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల సెక్రటరీ డాక్టర్ బెహరా విజయచైతన్య అభినందించారు. ఈ పోటీల్లో 12 అంశాల్లో 32 కళాశాలలు పాల్గొనగా.. క్లాసికల్, ఫోక్ డ్యాన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరికి ఏయూ రెక్టార్ డా.కిషోర్ బాబు ప్రశంసాపత్రాలు అందించారన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి కామేష్ పాల్గొన్నారు.

### దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళులు



దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

**మల్కాపురం:** పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. 59వ వార్డు శాంతిగిరి కాలనీ వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నగర ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయబాబు పాల్గొని దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల్లో జాతీయతా భావాన్ని నెలకొల్పడంలో పండిట్ ప్రధాన భూమిక పోషించారన్నారు. సంక్షేమ పథకాలు చిట్టచివరి వ్యక్తి వరకు అందాలనే ఉద్దేశంతో అంత్యోదయ సూత్రాన్ని ప్రతిపాదించారని వివరించారు. పార్టీ సీనియర్ నాయకులు పాలిమేర శ్రీను, సత్యనారాయణ, గురుమూర్తి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఉరేసుకుని బిహార్ వాసి మృతి

**మల్కాపురం:** ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చిన ఓ వ్యక్తి తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా.. బిహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ షకీల్(22) అనే వ్యక్తి తన ఊరికి చెందిన ముగ్గురు వ్యక్తులతో కలిసి హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ)లో జరుగుతున్న విస్తరణ పనుల్లో ఉపాధి నిమిత్తం విశాఖ నగరానికి వచ్చాడు. 61వ వార్డు ఆర్.కె.పురం వద్ద గల ఓ అద్దె ఇంట్లో కొద్ది రోజులుగా నివసిస్తున్నాడు. ఈ క్రమంలో షకీల్‌తో వచ్చిన ముగ్గురికి ఉపాధి నిమిత్తం పాస్‌లు అవ్వగా.. ఇతడికి పాస్ ఇంకా కాలేదు. దీంతో షకీల్ మనస్థాపానికి గురయ్యాడో.. లేదా మరే ఇతర కారణమో తెలియదు గానీ ఆ ముగ్గురు వ్యక్తులు గురువారం విధులకు వెళ్లగానే ఇతడు తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. పని ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చిన ఆ ముగ్గురు తలుపు ఎంతకొట్టినా షకీల్ తీయకపోవడంతో.. అనుమానంతో కిటికీ తెరిచి చూడగా.. గదిలో ఫ్యాన్‌కు వేలాడుతున్న అతడిని చూసి వెంటనే మల్కాపురం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి షకీల్ మృతిపై విచారించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఘటనపై సమాచారం అందించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### లక్ష్మీనరసింహ స్వామికి పంచామృతాభిషేకం

**సీతంపేట:** భాద్రపద స్వాతి నక్షత్రం సందర్భంగా లలితానగర్ శ్రీలలితా పీఠంలో కొలువైన లక్ష్మీనరసింహ స్వామికి గురువారం వేద పండితులు విశేష పంచామృతాభిషేకం జరిపారు. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.



చింతామణి దుర్గాగణపతి ఆలయం ఎదురుగా నిలిపిన ద్విచక్ర వాహనాలు, కార్లు

# విశాల రహదారి ఇరుకుమయం

- ఐవోసీ సర్వీస్ రోడ్డులో ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- చింతామణి దుర్గాగణపతి ఆలయం వద్ద అడ్డదిడ్డంగా నిలిపివేత
- ఇబ్బందులు పడుతున్న భక్తులు, పాదచారులు



ఐవోసీ సర్వీస్ రోడ్డులో షాపుల ముందు అడ్డంగా నిలిపిన ద్విచక్ర వాహనాలు

**మల్కాపురం:** విశాలమైన రహదారిలో ఇష్టానుసారంగా.. అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విశాల రహదారి కాస్తా ఇరుగ్గా మారడంతో అటుగా వచ్చే పాదచారులు, ఇతర వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మల్కాపురం సమీపాన గల ఐవోసీ సర్వీస్ రోడ్డులో పరిస్థితి ఇది. ఈ మార్గంలో చింతామణి దుర్గాగణపతి ఆలయ సముదాయంతోపాటు ఐవోసీ, బ్లాక్ ఆయిల్ టెర్మినల్ ప్లాంట్‌లు ఉన్నాయి. ఐవోసీ టెర్మినల్ ప్లాంట్ ఎదురుగా గల హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) స్థలంలో సంస్థ విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ పని చేయడానికి వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో కార్మికులు నిత్యం ద్విచక్ర వాహనాలపై వస్తుంటారు. పనుల నిమిత్తం వచ్చే కార్మికులకు ఆ సంస్థ పార్కింగ్ సదుపాయం కల్పించాల్సి ఉంది. ఈ ఏర్పాటు చేయకపోవడంతో కార్మికులు ఐవోసీ సర్వీస్ రోడ్డులో వారి వాహనాలను ఇష్టానుసారంగా పార్కిచేస్తున్నారు. దీంతో విశాలమైన రోడ్డు కాస్తా ఇరుకుమయంగా మారింది. ఆ మార్గంలో వచ్చే ఇతర వాహనాలు తప్పుకోలేని పరిస్థితి అక్కడ ఏర్పడింది.

**భక్తులకు ఇక్కట్లు**

ఇక్కడి చింతామణి దుర్గాగణపతి ఆలయ సముదాయానికి పారిశ్రామిక ప్రాంతం చుట్టుపక్కల నుంచి నిత్యం అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. వారు ఆలయంలోకి ప్రవేశించకుండా కార్మికులు ద్వారానికి అడ్డంగా వారి వాహనాలను నిలిపి వదిలేస్తున్నారు. భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇక్కడ గల చిన్న షాపుల ముందు వాహనాలు అడ్డంగా పార్కిచేస్తున్నారు. దీంతో ఆ షాపుల వద్దకు కొనుగోలుదారులు వెళ్లలేని పరిస్థితి కలుగుతోంది. ఈ సమస్యపై మల్కాపురం ట్రాఫిక్ పోలీస్‌లు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, పాదచారులు, భక్తులు కోరుతున్నారు.

### ఆలయానికి అడ్డంగా వాహనాలు

చింతామణి దుర్గాగణపతి ఆలయంలోకి పూజలు చేసేందుకు వెళ్దామంటే ప్రవేశం వద్ద అడ్డంగా పలువురు కార్మికులు వారి వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. దీంతో అసౌకర్యంగా ఉంది. కార్మికుల వాహనాల కోసం హెచ్‌పీసీఎల్ యాజమాన్యం పార్కింగ్ సదుపాయం కల్పిస్తే బాగుంటుంది.

– బంక నాగేశ్వరరావు పాత్రుడు, స్థానిక భక్తుడు

### రాకపోకలకు ఇబ్బందులు

ఐవోసీ సర్వీస్ రోడ్డులో పలు ద్విచక్ర వాహనాలను అడ్డదిడ్డంగా పార్కిచేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి. ఈ రోడ్డులోనే ఆయిల్ లారీలు రావడం, ద్విచక్ర వాహనాలు అడ్డంగా ఉండటంతో లారీలు తప్పుకోలేని పరిస్థితి కలిగి ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. ఈ సమస్యపై వాహనాలు స్పందించాలి.

– సమ్మిడి అప్పలరాజు, పాదచారుడు

### విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

**మల్కాపురం:** శ్రీహరిపురం విద్యుత్ ఉపకేంద్రం పరిధి పిలకవానిపాలెం 11 కేవీ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 27న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు శ్రీరామ్‌నగర్, ఉప్పర కాలనీ, గొందేశివానిపాలెం, పిలకవానిపాలెం, అన్నపూర్ణనగర్, కోడిపందాలదిబ్బ, గుల్లలపాలెం, శ్రీనివాస్‌నగర్, రామ్‌నగర్, కుంచిమాంబ కాలనీ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

### మహిళలకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



మహిళలకు ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుజాత

**గోపాలపట్నం:** మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యవంతంగా ఉంటుందని గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత అన్నారు. స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆస్పత్రిలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మహిళలకు వ్యాధులపై డాక్టర్ సుజాత అవగాహన కల్పించారు. అనారోగ్యానికి గురైతే వైద్యులు సలహా తీసుకోవాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కొంత వయసు దాటిన తరువాత మహిళల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, రక్తపోటు మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. గోపాలపట్నం ఆస్పత్రిలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. ఈఎన్‌టీ దంత, గైనిక్, బీపీ, మధుమేహం వంటి వ్యాధులపై వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# నగర శుభ్రత.. అందరి బాధ్యత

- మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్
- ఉత్సాహంగా శ్రమదానం



మర్రిపాలెం వుడా లేఅవుట్ గ్రీన్‌బెల్ట్ వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేస్తున్న జియ్యాని శ్రీధర్



62వ వార్డులో వీధిని శుభ్రపరుస్తున్న మజ్జి మాలినాయుడు, జీవీఎంసీ సిబ్బంది



గుల్లలపాలెం వాకింగ్ పార్క్ పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ సురేష్, సిబ్బంది



గోపాలపట్నం వుడా లేఅవుట్‌లో మొక్కలు నాటుతున్న స్థానికులు, జీవీఎంసీ సిబ్బంది



40వ వార్డు ఏకేసీ కాలనీలో వీధిని శుభ్రపరుస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు



సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద శుభ్రం చేస్తున్న నాయకులు, పారిశుధ్య సిబ్బంది

**గోపాలపట్నం:** మన నగరాన్ని మనమే శుభ్రం చేసుకుందామని జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా.. ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా గురువారం 52, 91, 92 వార్డుల్లో శ్రమదానం నిర్వహించారు. 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని గ్రీన్‌బెల్ట్ వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ నగర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోడానికి రోజులో ఒక గంట పాటు అందరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వాకింగ్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం వుడా కాలనీలో మొక్కలు నాటారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి, వుడా కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.
- 91వ వార్డు సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద శానిటరీ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన శుభ్రత కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నారిపిన్ని సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

**స్వచ్ఛతతోనే ప్రగతి**

**మల్కాపురం:** స్వచ్ఛతతోనే ప్రగతి సాధ్యమని 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉరుకూటి సతీష్‌యాదవ్ ఆధ్వర్యంలో గుల్లలపాలెం వాకింగ్ పార్క్ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందమైన విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చుదిద్దుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాండ్రగి జయరాజ్, బీజేపీ నాయకురాలు వసుంధర, రాములు, వార్డు శానిటరీ సెక్రటరీలు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు కోరాడ శ్రీను, పొత్తబత్తుల శ్రీను, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి పాల్గొని శ్రీహరిపురంలోని సర్వీస్ రోడ్లను పరిశుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ తమ చుట్టుపక్కల ప్రదేశాలను రోజులో ఓ గంట పాటు శుభ్రం చేయాలని సూచించారు. వార్డు శానిటరీ, మలేరియా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**సింధియా:** జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో పలు ప్రాంతాలను కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు శుభ్రపరిచి, స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత**

మన చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పారిశ్రామికవేత్త మజ్జి మాలినాయుడు కోరారు. 62వ వార్డులో ఏక్ దిన్.. ఏక్ సాథ్.. ఏక్ గంటా కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్గానగర్, త్రినాథపురం, ఏఎస్సార్ కాలనీ తదితర ప్రాంతాలను శుభ్రపరిచారు. స్థానిక నాయకులు దుర్గారావు, శ్రీధర్, కన్నారావ్, ఆర్పీ ఆదిలక్ష్మి, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## తోపుడు బండ్ల వ్యాపారులను ఆదుకోవాలి





మల్కాపురం జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

**మల్కాపురం:** ఫుట్‌పాత్ వ్యాపారులపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరి కాదని, తోపుడు బండ్ల వ్యాపారులకు అండగా నిలవాల్సిన పాలకులు, అధికారులు వాటిని తొలిగించే విధంగా చర్యలు చేపట్టడం ఎంతవరకు న్యాయమని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు కాంద్రేగుల సత్యాంజనేయ ఆవేదన వ్యక్తం చేశారు. తోపుడు బండ్ల వ్యాపారులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ మల్కాపురం జోన్ నాయకులు పలువురు వ్యాపారులతో కలిసి మల్కాపురం జంక్షన్ వద్ద గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి లేక, వేలాది రూపాయలు అద్దెలు చెల్లించలేక ఫుట్‌పాత్‌లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ చాలా మంది నిరుద్యోగులు జీవిస్తున్నారన్నారు. నేడు వారి పొట్ట కొట్టాలని కూటమి సర్కార్ ఆలోచన చేయడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నమ్మి ఓట్లు వేసిన చిరు వ్యాపారులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. చిరు వ్యాపారులకు అన్యాయం జరిగితే తాము ఊరుకోమని, అందరితో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గుండాల రాంబాబు, రమేష్, నూకరాజు, ఆర్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారుల నిరసన ర్యాలీ



గోపాలపట్నంలో ర్యాలీ చేస్తున్న తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల సంఘం సభ్యులు

**గోపాలపట్నం:** తోపుడు బండ్ల వ్యాపారులు, చిల్లర వర్తకులు గురువారం గోపాలపట్నంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద నుంచి బాజి జంక్షన్ మీదుగా గోపాలపట్నం బంక్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకురాలు పి.అనసూయ మాట్లాడుతూ గోపాలపట్నంలో చిల్ల వర్తకుల కడుపులు కొట్టేలా అధికారులు వ్యవహరించడం దారుణమన్నారు. వందలాది తోపుడు బండ్ల వ్యాపారులు, చిల్లర వ్యాపారులు రోడ్డున పడ్డారని, వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల సంఘం అధ్యక్షుడు జి.మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బి.జగదీష్, కోశాధికారి ఎస్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం



షేక్ సలీమా

**గోపాలపట్నం:** జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలేనికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలిలా.. కొత్తపాలెం నాగేంద్ర కాలనీలో షేక్ సలీమా(39) భర్తతో కలిసి నివసిస్తోంది. ఆమెకు మతిస్థిమితం లేకపోవడంతో బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఎవరికీ తెలియకుండా బయటకు వెళ్లిపోయింది. ఉదయం లేచి చూసే సరికి సలీమీ ఇంట్లో లేకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లి వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించక పోవడంతో సలీమా భర్త పీర్ సాహెబ్ గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మహిళ ఆచూకీ తెలిసిన సమాచారమివ్వాలని కోరారు.

## కాత్యాయనిగా దుర్గాదేవి

వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు



గాజువాక ఆర్టీసీ డిపో వద్ద కాత్యాయనిగా దుర్గమ్మ



ములగాడలో పూజలు అందుకుంటున్న దుర్గమ్మ



బుచ్చిరాజుపాలెం బంగారమ్మ దుర్గాలమ్మ ఆలయంలో ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

**గోపాలపట్నం:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు దుర్గామాత కాత్యాయనిగా పూజలందుకున్నారు. గోపాలపట్నం, ఎన్‌ఏడీ ప్రాంతాల్లోని పలు ఆలయాలు, మండపాల వద్ద భక్తులు విశేష పూజలు చేశారు.

- బుచ్చిరాజుపాలెం బంగారమ్మ దుర్గాలమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన కుంకుమపూజలకు అధిక సంఖ్యలో మహిళలు హాజరై, పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.
- గాంధీనగర్‌లో స్థానిక యువకులు ఏర్పాటు చేసిన మండపం ఆకట్టుకుంటోంది. భవానీ మాలధారులు భక్తితో అమ్మవారిని అర్చిస్తున్నారు.
- జయప్రకాష్‌నగర్‌లో మండపంలో కొలువుదీరిన అమ్మవారికి నిత్యం విశేష అర్చనలు చేస్తున్నారు. కుంకుమార్చనలు, కలశపూజలు చేశారు.

**ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు**



గాంధీనగర్‌లో దుర్గాదేవి

బంగారమ్మ దుర్గాలమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు భక్తులను ఆకట్టుకుంటోంది. నిర్వాహకులను అభినందిస్తున్నారు.

**పారిశ్రామిక ప్రాంతంలో..**

**మల్కాపురం:** గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని కాత్యాయని దేవిగా అలంకరించి, పూజలు చేశారు. అమ్మవారిని పుష్పమాలలతో అలంకరించి, చెరకు, అప్పాలను నైవేద్యంగా సమర్పించారు. స్థానిక మహిళా భక్తులు అమ్మవారికి కీర్తనలు ఆలపిస్తూ భజనలు చేశారు.

- మల్కాపురం, శ్రీహరిపురం, ములగాడ తదితర ప్రాంతాలలో దుర్గాదేవి మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశాయి.

## స్వచ్ఛందంగా దుకాణాల తొలగింపు

అధికారుల ఒత్తిడి తట్టుకోలేక ఫుట్‌పాత్‌లు ఖాళీ చేస్తున్న వ్యాపారులు

**మల్కాపురం:** అధికారుల ఆక్రమణల తొలగింపు చర్యలు.. ఫుట్‌పాత్ వ్యాపారుల పాలిట శాపంగా మారాయి. కొన్నేళ్లుగా ఫుట్‌పాత్‌లపై వివిధ వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వ్యాపారుల జీవితాల్లోకి చీకటి రోజులొచ్చాయి. పారిశ్రామిక ప్రాంతం జింక్ నుంచి సింధియా వరకు గల సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై సుమారు 200 మంది వరకు చిల్లర వర్తకులు వివిధ వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీటికి ఎలాంటి అనుమతులు లేకున్నా.. వేలాది రూపాయలు అద్దెలు చెల్లించలేక తమ స్థాయికి తగ్గట్టు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబ పోషణతోపాటు పిల్లలను చదివించుకుంటూ వస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు జింక్ నుంచి సింధియా పరిధి సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా గల ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగించాలని, లేకుంటే తామే తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో చేసేదేం లేక దాదాపు 60 శాతం వరకు వ్యాపారులు తమ బడ్డీలను తొలగించారు. మల్కాపురం పోలీస్ స్టేషన్ ప్రాంతం, ఐవోసీ సర్వీస్ రోడ్డులో, నౌసేనా బాగ్ ఎదురుగా ఏర్పాటు చేసిన దుకాణాలను గురువారం స్వచ్ఛందంగా చిరు వ్యాపారులు తొలగించి తరలించారు. రోడ్డున పడ్డామని, ఇకపై తామంతా ఎలా జీవించాలంటూ ఫుట్‌పాత్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మల్కాపురం పీఎస్ ప్రాంతంలో దుకాణాలను తరలిస్తున్న వ్యాపారులు